4 -7Pg9th cheli 1:4 -7Pg9th cheli 1.qxd 7/3/2026 11:47 PM Page 1



ఫ్యాషన్ ఫ్యాషన్

# పరువాల రెమ్మలు






ఒకప్పుడు పండుగలు, పెళ్లిళ్లు అంటూ చిన్న పిల్లల నుంచి టీనేజీ అమ్మాయిలకు గుర్తుకు వచ్చేది పరికిణీ-జాకెట్టు మాత్రమే. అమ్మమ్మల పెట్టెల్లో దాచిన పట్టులంగాలు, మెరిసే జాకెట్లు ఆనాటి సౌందర్యానికి నిదర్శనాలు. కాలం మారేకద్దీ వాటి స్థానంలో గాగ్రాచోళీలు, లాంగ్ స్కర్ట్‌లు, క్రాప్‌టాప్‌లు-లెహంగాలు.. ఇలా ఎన్నో కొత్త ఫ్యాషన్‌లు వచ్చిచేరాయి. అయితే ఈ తరం అమ్మాయిలు ఆపాత మధురాల్నే ఇష్టపడు తుంటంతో మళ్లీ ట్రెండ్ అవు తున్నాయి. అప్పట్లోలా ఇవి కేవలం టీనేజీ అమ్మాయిలకే పరిమితం కావడం లేదు. యువతులూ వీటిని ఇష్టపడుతున్నారు. డిజైనర్లు సైతం భిన్న ఫ్యాబ్రిక్స్, ఆధునిక కటింగ్స్‌తో వీటిని సరికొత్తగా డిజైన్ చేస్తున్నారు. కొత్తవే కాదు.. పాతకాలపు చీరల్నీ ఇలా మార్చేసి స్టైయినబుల్ ఫ్యాషన్‌కి ప్రాధాన్యం ఇస్తున్నారు. దాంతో ఈ పరికిణీ-జాకెట్లు పార్టీల నుంచి పెళ్లి వేడుకల వరకూ దేనికైనా స్టేట్‌మెంట్‌లుక్ ఇస్తున్నాయి.

# పెద్దల సంరక్షణ చూద్దాం.. !



**ఇంట్లో అమ్మమ్మ, నాన్నమ్మ, తాతయ్యల ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు మారుతున్న సీజన్ తగ్గట్లుగా జాగ్రత్తలు తీసుకొంటూ పరిరక్షించాలి. వర్షాకాలంలో వారినెలా సంరక్షించాలో చూద్దాం.**

కాచి చల్లార్చిన లేదా గోరువెచ్చని నీటిని తరచూ తీసుకోవడం అలవాటు చేయాలి. సాధారణ వర్షా కాలంలో నీటి ద్వారా కలరా, టైఫాయిడ్, డయేరియా వంటి అనారోగ్యాలు దరి చేరే ప్రమాదం ఉంది. దీని నిరోధించాలంటే వేడి నీటిని మాత్రమే తాగాలి. స్నానానికి కూడా గోరువెచ్చని నీటిని ఏర్పాటు చేయాలి. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు ఉండాలి. రయిన్‌కోటు వంటి ఏర్పాట్లు ఉండేలా జాగ్రత్త పడాలి.

వ్యాధులెక్కువగా ప్రబలే సీజన్ కావడవంతో వ్యాధినిరోధక శక్తిని పెంచేలా ఆహారాన్ని అందించాలి. వాతావరణంలో మార్పులు, అతి చల్లదనం. తరచూ చినుకుల్లో తడవడంవల్ల జలుబు, జ్వరం దగ్గు బాధిస్తాయి. వీటికి దూరంగా ఉంచాలంటే గింజ ధాన్యాలు, పోషక విలువలు ఉన్న ఆహారాన్ని అందించాలి. వాతావరణంలో మార్పులు అతి చల్లదనం, తరచూ చినుకుల్లో తడవడంవల్ల జలుబు, జ్వరం, దగ్గు బాధిస్తాయి. వీటికి దూరంగా ఉంచాలంటే గింజధాన్యాలు, పోషక విలువలు ఉన్న ఆహారాన్ని ఇవ్వాలి. తీపి, నూనె పదార్థాలు, ప్రాసెస్డ్ ఫుడ్‌కు దూరంగా ఉంచాలి. ఇంటి భోజనానికి పెద్దపీట వేసేలా చూడాలి. తాజా పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు సహా పీచు ఎక్కువగా ఉండే ఆహారానికి ప్రాధాన్యతనివ్వాలి. దీంతో జీర్ణశక్తి మెరుగు పడుతుంది. త్వరగా అనారోగ్యాలు దరిచేరవు. వీరు విశ్రాంతి తీసుకునే గది, దాని చుట్టుపక్కల పరిశుభ్రంగా ఉండాలి. గదికి సమీపంలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త పడాలి. లేదంటే వాటిపై దోమలు పెరిగే ప్రాదం ఉంది. గదిలో వెలుతు ఉండేలా చూడాలి. ఇండోర్ ప్లాంట్స్ పెంపకం మంచిది. వీరు నిద్రపోయే గది వెచ్చగా ఉంటే రక్తప్రసరణ మెరుగ్గా ఉంటుంది. దోమ లెక్కువగా ఉండే ప్రాంతమైతే ఈ సీజన్‌లో కిటికీలకు నెట్ వేయడం మంచిది. లేదంటే దోమకాటు కూడా తీవ్ర అనారోగ్యాలకు దారి తీస్తుంది.

# కాఫీతో.. ఎంతో!



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి



కెఫిన్ వల్ల శరీరంలో ఒక రకమైన వ్యాధి నిరోధక శక్తి పెరిగి అనేక వ్యాధులు తగ్గు ముఖం పట్టే అవకాశం ఉంది. కెఫిన్ న్యూరోట్రాన్సిమీటర్స్ అయిన నార్ ఎడ్రినాలిన్, అసిటైల్ కోలిన్, డోపమైన్ స్థాయిల్ని పెంచి ఏకాగ్రత, చురుకుతనం జ్ఞాపకశక్తి మెరుగుపడి, మెటబాలిక్ రేట్ పెరిగి తాత్కాలికంగా హుషారుగా ఉండేటట్లు చేస్తుంది థర్మోజెనిసిస్ (శరీరంలో వేడి)ని మెరుగు పరుస్తుంది. వృద్ధాప్యం దూరమవుతుంది. స్టోక్ 22.25% గుండె వ్యాధులు తగ్గుతాయి. ఇన్సులిన్ సెన్సిటివిటీ మెరుగవుతుంది. మెదడు సిఆర్‌సిబిఐ అనే ప్రోటీన్ ఉత్పత్తి 600 కేలరీలు ఖర్చు అవడమే కాక జ్ఞాపకశక్తికి మంచిది. అంతేకాకుండా వత్తిడి, తలనొప్పి, బద్ధకం తగ్గుతుంది. క్రొవ్వుని కరిగించడం వల్ల గుండె క్రమబద్ధంగా పనిచేసి గుండెకు రక్షణ కల్గిస్తుంది. పక్షవాతం రాదు. హానికరమైన కాలేయ ఎంజైమ్‌ల స్థాయిల్ని తగ్గిచడం వల్ల లివర్ సిర్రోసిస్, గాల్‌స్టోన్స్, పాంక్రియా టైటిస్, ఫ్యాటీ లివర్, లివర్ వ్యాధులు కొంతవరకు తగ్గుతాయి. టైప్-2 డయాబెటిస్, కొనరీ ఆర్టరీ డిసీజెస్, ట్రైగ్లిజురైడ్స్‌ను తగ్గిస్తుంది. ఆలోచనా సామర్థ్యాన్ని పెంచుతుంది. నర్వస్‌నెస్, డిమెన్షియా తగ్గుతుంది. స్థూలకాయుల్లో కొంతవరకు బరువు తగ్గుతారు. గుండె వైఫల్యాన్ని తగ్గిస్తుంది. అధిక ఆంటీ ఆక్సి డెంట్స్ వల్ల ఫ్రీ రాడికల్స్ నుండి శరీరాన్ని డ్యామేజ్ కాకుండా కాపాడడం వల్ల డిఎన్ఎ బలంగా ఉడడం వల్ల ఓవేరియన్ ప్రోస్టేట్, గొంతు, థైరాయిడ్, గ్యాస్ట్రిక్, కోలన్ రెక్టల్, స్టమక్ కేన్సర్స్‌ని కొంత మేర తగ్గిచడంలో, ఉపయోగపడతాయి. ఆపరేషన్స్ అయిన తర్వాత గ్యాస్ట్రిక్ కదలికలు, బవల్‌మూవ్ మెంట్స్‌ని కల్గిస్తుంది. ఇది నాన్ ఆల్కహాలిక్స్‌కి కొంత మేలు కల్గిస్తుంది. పార్కిన్‌సన్ డిసీజ్, ఆటిజమ్, మెంటల్ ఎలర్ట్‌నెస్‌కి మంచిది డిప్రెషన్ రోగుల్లో, మూడ్ ఛేంజ్స్ ఉన్నప్పుడు, మలబద్ధకం, అధిక ఆకలిని తగ్గిస్తుంది.

**స్త్రీలలో కాఫీ చేసే మేలు :** ఆల్జీమర్స్ బాధపడే అమెరికన్స్‌లో మూడింట రెండువంతులు మహిళలున్నారు. మహిళల్లో మరణానికి నాల్గవ ప్రధాన కారణం స్ట్రోక్, డిప్రెషన్ 8% తగ్గుతుంది. 23% స్త్రీలలో పెద్ద ప్రేగు కేన్సర్ ఎండోమెట్రియల్ కేన్సర్ థైరాయిడ్, రొమ్ము, కలోరెక్టల్ కేన్సర్స్ పిరియాడ్స్ అగిపోయిన తర్వాత వచ్చే అవకాశాల్ని తగ్గిస్తుంది. వినికిడి శక్తిని పెంచుతుంది. గర్భిణీలు కాఫీ అలవాటుని మానివేస్తే మంచిది. మానివేయాని ఎడల రోజుకి 1-2 కప్పులు తీసుకోవాలి. ఎక్కువగా, ఎక్కువసార్లు తీసు కుంటే అబార్షన్ కావడం, నెలలు నిండకుండా కాన్పు కావడం, తక్కువ బరువు పిల్లలు పుడతారు. బాలింతలు పాలు ఎక్కువగా వేసుకొని కాఫీ డికాషన్ తక్కువగా ఉండేలా ఒక కప్పు వరకు తీసుకోవచ్చు. క్రొవ్వు కణాల్ని డీహైడ్రేట్ చేసి సెల్యులైట్ రూపాన్ని తాత్కాలికంగా తగ్గిస్తుంది.

**సౌందర్యపోషణలో కాఫీ పాత్ర:** కాఫీలోని కెఫిన్ మీ చర్మాన్ని బిగుతుగా చేసి వాపుల్ని తగ్గిస్తుంది. రక్త ప్రసరణని మెరుగుపరిచి మృదువైన చర్మ ఆకృతిని ప్రోత్సహిస్తుంది. పొడిచర్మంగలవారు వారానికొకసారి, జిడ్డు చర్మం గలవారు వారా నికి 2-3సార్లు కాఫీపొడిని స్క్రబ్‌గా వాడడం వల్ల చర్మంకాంతి వంతంగా అవుతుంది. కాఫీ ఫేస్ మాస్క్‌లలో ముఖం, చేతులపై సన్ ట్యాన్‌ని, గీతలు, మొటిమలు, మచ్చలు, ముడతలు, వృద్ధాప్య సంకేతాలు తగ్గుతాయి. చర్మకేన్సర్ రాకుండా నిరోధించే శక్తి కాఫీకి ఉంది. కాఫీలోని క్లోరోజెనిక్ ఆసిడ్, ట్రైగోనెల్లిన్, కెఫిక్ ఆసిడ్, డైఫినాల్స్ వంటి ఆంటి ఆక్సిడెంట్స్ వల్ల ముఖం, చర్మ సౌందర్యం ఇనుమడిస్తుంది.

# సర్పయాగం

జనమేజయుడు ఎంతో మంచి రాజు ' ఓ రాజా నీ తండ్రిని తక్షకుడు చంపాడు. నీవు సర్పయాగాన్ని చేసి తక్షకుడిని, అతని సహచర పాముల నన్నిటినీ సంహరించు అని అతని మంత్రులంతా సలహా ఇచ్చారు. జనమేజయుడు శ్రేష్ఠులను పిలిపించి శాస్త్రంలో చెప్పిన కొలతల ప్రకారం హోమ గుండాలను, యాగశాలను ఏర్పాటు చేసి మంచి ముహూర్తంలో యాగాన్ని ప్రారంభించాడు. సర్పా లన్నీ వచ్చి హోమగుండంలో పడి భస్మమయ్యాయి. అంతలోనే ఆస్తీకుడు వచ్చి, జనమేజయరాజును, మెప్పించి, ఒప్పించి సర్పయాగాన్ని ఆపేశాడు. అగ్ని గుండంలో పడటానికి సిద్ధంగా వున్న తక్షకుడు యాగం ఆగిపోవటం వల్ల బ్రతికిపోయాడు. ఇది శ్రీ మదాంధ్ర మహా భారతము, ఆది పర్వములో వున్న కథ (పుటలు 29-32- రామకృష్ణమఠ ప్రచురణ). దీని నుంచి మనం ఈనాడు గ్రహించవలసిన ముఖ్య అంశా లెన్నో ఉన్నాయి. మంచి వాడైన రాజు మంత్రులి చ్చిన దుష్ట సలహాలను పాటించ దలిచాడు. తన తండ్రిని చంపినది తక్షకుడైతే ఏ పాపమూ చేయని ఇతర పాములను కూడా చంపమని చెప్పిన మంత్రులను దండించాల్సి ఉంటుంది. కానీ వారి సలహాకు తల ఒగ్గాడు. శ్రేష్ఠులు వాస్తు శాస్త్రం ప్రకారం శుభ ముహూ ర్తంలో పూజాది కార్య క్రమాలతో యాగాన్ని ప్రారంభించినా ఏ లక్ష్యంతో సర్పయాగాన్ని చేశాడో ఆ లక్ష్యం మాత్రం నెరవేరలేదు. తక్షకుడు మరణించ లేదు. మరి మహాభారత కథ ఏ నీతిని బోధిస్తున్నది? వాస్తు, జ్యోతిష్యం ఇలా మనం పరిగణనలోకి తీసుకోవలసినది? అందులో ఆరితేరిన ప్రవీణులు ఆ శాస్త్రాల్లో చెప్పబడినట్టు ఉత్తములైన ఋత్విక్కులతో యాగాన్ని చేయిస్తే లక్ష్యం నెరవేరలేదే? వ్యాస భగవానుని, భారతేతి హాస హృదయాన్ని మనం పసిగట్టక, సత్యం కల్వానికి కాక, దూరాలోచనల కు ప్రాధాన్యమిస్తే మూర్ఖులమే అవుతాం. దుష్ట సంకల్పంతో చేయబడే యజ్ఞ యాగాదులు కూడా ఫలించవు. భారతం నేర్పే నీతి అదే. అదే విష యాన్ని సహృదయుడైన ఒక వాస్తు పండితుడు రాజుకు ముందే సూచించాడు కూడా తక్షకుడిని చంపాలని యాగం చేస్తే, తక్షకుడుతప్ప అమాయకులంతా చచ్చారు.

# ఛాయ్ బిస్కెట్లు ..



**బిస్కెట్లలో బోలెడన్ని రకాలుంటాయి కదూ!** తమ తమ ఇష్టాలను బట్టి నచ్చేవి కొనుక్కుంటారు. అంతే తప్ప బిస్కెట్లు మన తయారు చేసుకోవడం కొంచెం తక్కువ. ఈ గోధుమపిండితో చేసే డైజెస్టివ్ బిస్కెట్లు చాలా సులువుగా ఇంట్లోనే చేసుకోవచ్చు. దీని కోసం స్వచ్ఛమైన గోధుమపిండి అరకిలో, పలు, పంచదార, రవ్వ, ఎండు కొబ్బరి ఒక్కోటీ కప్పు చొప్పున, సోంపు ఒకటిన్నర స్పూన్, నెయ్యి 3 టేబుల్ స్పూన్లు తీసుకోవాలి. ఒక పాత్రలో ఈ పదార్థాలు అన్నిటినీ వేసి బాగా కలపాలి. మెత్తటి ఈ పిండితో కొంచెం మందమైన రొట్టెలు చేయాలి. దాని మీద గ్లాసు లేదా మూతతో నొక్కి గుండ్రటి ఆకృతులు వచ్చేలా కట్ చేయాలి. వాటి మీద ఫోర్క్‌తో గుచ్చి, రంధ్రాలు చేయాలి అన్నీ పూర్తయ్యాక. కాగుతున్న నూనెలో వేయించుకుంటే సరి. కరకరలాడే బిస్కెట్లు తయారైపోతాయి. ఇవెంతో రుచీ, ఆరోగ్యం కూడా. నచ్చితే మీరూ చేసి చూడండి. పిల్లలూ పెద్దలూ అందరూ ఇష్టంగా తింటారు. ఇవి చాయ్‌లోకి మరింత బాగుంటాయి.

## 'VISA- వింటారా సరదాగా' రెండో గీతం విడుదల



'VISA - వింటారా సరదాగా' చిత్ర బృందం రెండో గీతం 'చింగారి'ని విడుదల చేసింది. హృదయాన్ని హత్తుకునే బాణీలు అందించడంలో పేరుగాంచిన విజయ్ బుల్గానిన్ అద్భుతమైన సంగీతాన్ని సమకూర్చిన ఈ మెలోడీ గీతాన్ని, తన ప్రత్యేకమైన గానంతో శ్రోతలను అలరించే సిద్ శ్రీరామ్, లిప్సిక ఎంతో అందంగా ఆలపించారు. సనారే రచించిన 'చింగారి' పాట ప్రతి ఒక్కరి గుండెల్ని తాకేలా ఉంది. ప్రేమ లోని నిశ్శబ్ద వేదనను, మనసులో రగిలే భావోద్వేగాలను ఎంతో కవితాత్మకంగా ఆవిష్కరిస్తుంది. 'VISA వింటారా సరదాగా' చిత్రం ప్రతి అప్‌డేట్‌తో ప్రేక్షకుల్లో అంచనా లను భారీగా పెంచు తోంది. ఈ చిత్ర టీజర్ ఒక సరికొత్త కథనంతో, విదేశా ల్లోని తెలుగు విద్యార్థుల జీవితాన్ని ఆవిష్కరిస్తూ ప్రేక్షకు లను ఎంతగానో ఆకట్టు కుంది. తొలి గీతం 'అనగనగా అమెరికా' ఒక హుషారైన పాటగా నిలిచి, అన్ని వేదికల్లో అందరి మనసులను గెలుచుకుంది. ఇప్పుడు విడుదలైన 'చింగారి' పాటతో ఈ చిత్రం తనలోని రొమాంటిక్ కోణాన్ని ఆవిష్కరించింది. హృదయాన్ని తాకే స్వరాలు, సాహిత్యంతో ఈ పాట సంగీత ప్రియుల మనసులను గెలుచుకుంటోంది. నూతన దర్శకుడు ఉద్భవ్ రఘు దర్శకత్వంలో రూపొందు తున్న ఈ చిత్రంలో అశోక్ గల్లా, శ్రీ గౌరీ ప్రియ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. రాహుల్ విజయ్, శివాత్మిక రాజశేఖర్, సత్య, వైవా హర్ష, గుండు సుదర్శన్ ఇతర ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. అమెరికాలోని తెలుగు విద్యార్థుల జీవితాల నేపథ్యంతో ఎంతో వైవిధ్యంగా, హృద్యమైన భావోద్వేగాలతో ఈ సినిమా రూపొందుతోంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రేక్షకుల అభిరుచులకు తగ్గట్టుగా సినిమాలు తీసే అభిరుచి గల నిర్మాతలు కావడంతో 'VISA - వింటారా సరదాగా' పై నమ్మకం మరింత పెరిగింది.

## 'బాలన్ ది బాయ్' పై మణిరత్నం ప్రశంసలు



గ్రాండియర్ ఫిలిం మేకింగ్ కు మారుపేరైన కేవీఎన్ ప్రొడక్షన్స్, తెస్పియన్ ఫిలింస్ సంయుక్తంగా నిర్మించిన మూవీ "బాలన్ ది బాయ్". ఈ చిత్రానికి 'ఆవేశం' ఫేమ్ డైరెక్టర్ జితూ మాధవన్ అందించిన స్క్రిప్ట్‌తో "మంజుమ్మెల్ బాయ్స్" చిత్ర దర్శకుడు చిదంబరం దర్శకత్వం వహించారు. వెంకట్ కె నారాయణ, శైలజా దేశాయి ఫెన్ నిర్మాతలుగా వ్యవహరించారు. ఈ సినిమా తెలుగులో సక్సెస్ ఫుల్ గా రన్ అవుతోంది. హీరో నాగచైతన్యతో పాటు పలువురు టాలీవుడ్ సెలబ్రిటీలు "బాలన్ ది బాయ్" సినిమాకు సపోర్ట్ గా నిలిచారు. మలయాళంలో డైరెక్టర్ ప్రియదర్శన్ అప్రిషియేట్ చేశారు. మరోవైపు కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, జ్యోతిక దంపతుల ప్రశంసలు అందుకుందీ మూవీ. తాజాగా లెజెండరీ డైరెక్టర్ మణిరత్నం "బాలన్ ది బాయ్" సినిమాపై ప్రశంసలు కురిపించారు. "బాలన్ ది బాయ్" సినిమా స్పెషల్ స్క్రీనింగ్ కు హాజరైన డైరెక్టర్ మణిరత్నం ఈ చిత్రాన్ని తిలకించారు. ఈ సినిమా స్క్రిప్ట్ ను, నటీనటుల పర్ ఫార్మెన్స్ ను మణిరత్నం అభినందించారు. మణిరత్నం ప్రశంసలు ఎంతో విలువైనవిగా భావిస్తున్నట్లు మూవీ టీమ్ ప్రకటించారు.

## 'ఇమ్మోర్టల్' నుంచి 'లవ్‌వు లవ్‌వు రాకాసి' సాంగ్ రిలీజ్



మల్టీ ట్యాలంటెడ్ జి.వి. ప్రకాష్ కుమార్, కయదు లోహర్ జంటగా నటిస్తున్న డార్క్ ఫాంటసీ సూపర్ నేచురల్ థ్రిల్లర్ 'ఇమ్మోర్టల్' మరియప్పన్ చిన్న దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని అరుణ్ కుమార్ ధనశేఖరన్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలోని 'లవ్‌వు లవ్‌వు రాకాసి' సాంగ్ రిలీజ్ చేశారు. యువతను అలరించే క్యాచీ ట్యూన్, ఉత్సాహభరితమైన బీట్‌లతో రూపొందిన ఈ పాట ఇప్పటికే మంచి స్పంద నను అందుకుంటోంది. ఈ పాటకు సామ్ సి.ఎస్ అద్భుతమైన ట్యూన్ అందించగా, అరవింద్, రేష్మా శ్యామ్ తమ ఎనర్జిటిక్ వోకల్స్ తో పాటకు ప్రత్యేక ఆకర్షణ తీసుకొచ్చారు. ప్రేమలోని సరదా, అల్లరి భావాలను ప్రతిబిం బించేలా రాజ్‌శ్రీ సుధాకర్ సాహిత్యాన్ని అందించారు. మెలోడీ, బీట్, లిరిక్స్ సమన్వయంతో రూపొందిన ఈ పాటలో జి.వి. ప్రకాష్ కుమార్, కయదు లోహర్‌ల మధ్య కెమిస్ట్రీ ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. కలర్ ఫుల్ విజువల్స్, ఆకట్టుకునే డాన్స్ మూవ్‌మెంట్స్, స్టైలిష్ ప్రెజెంటేషన్‌తో రూపొందిన ఈ గీతం సినిమా మీద అంచనాలను మరింత పెంచుతోంది.

## 'వదలా' జూలై 17న థియేటర్లలో రిలీజ్



వెర్సటైల్ యాక్టర్ జగపతి బాబు సస్పెన్స్, మిస్టరీ, బలమైన భావోద్వేగాలతో కూడిన సైకలాజికల్ థ్రిల్లర్ 'వదలా'లో ఇంటెన్స్ పాత్రలో కనిపించను న్నారు. అకెళ్ల వి. కృష్ణ దర్శ కత్వం వహిస్తున్న ఈ చిత్రంలో లయ, హృతిక శ్రీనివాస్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. చరిత చిత్ర ప్రొడక్షన్స్ బ్యానర్‌పై కిషోర్ నాయుడు చిరుమామిళ్ల, తమ్మారెడ్డి భరద్వాజ్ నిర్మిస్తున్న ఈ చిత్రం, ఇప్పటికే 'ఫస్ట్ గ్లింప్స్'తో ఆసక్తిని రేకెత్తించగా, టీజర్ అంచనాలను మరింత పెంచింది. ఈ చిత్రం జూలై 17న థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం ఆకట్టుకునే కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. విడుదల తేదీ పోస్టర్ సినిమా మిస్టీరియస్ వాతావరణాన్ని ఆసక్తికరంగా ప్రతిబింబిస్తోంది. రెడ్ బ్యాక్ డ్రాప్ లో హృతికా శ్రీనివాస్ లోలోపల ఎన్నో రహస్యాలు దాచుకున్నట్లుగా కనిపించే ఎక్స్‌ప్రెషన్‌తో ఆకట్టుకుంటున్నారు. విడుదల తేదీ ఖరారైన నేపథ్యంలో రానున్న రోజుల్లో సినిమా ప్రమోషన్స్‌లో మరింత జోరు పెంచనున్నారు. త్వరలోనే థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేయనున్నారు. ఈ చిత్రానికి ఛోటా కె. నాయుడు సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, కార్తీక్ కొడకండ్ల సంగీతం సమకూరుస్తున్నారు. కోటగిరి వెంకటేశ్వరరావు ఎడిటర్‌గా, లక్ష్మీ భూపాల కథా రచయితగా, బజ్జా బ్రహ్మయ్య ప్రొడక్షన్ డిజైనర్‌గా పనిచేస్తున్నారు.

# తెర

## 'అమీర్ లోగ్' ను రిలీజ్ చేయబోతోన్న రానా 'స్పిరిట్ మీడియా'



'అమీర్ లోగ్' ను భారీ ఎత్తున రిలీజ్ చేయబోతోన్న రానా 'స్పిరిట్ మీడియా' అవ్వల్ నంబర్ ప్రొడక్షన్స్ ఎల్ఎల్‌పి బ్యానర్ పై మాధవి రెడ్డి సోమ నిర్మాణంలో రమణా రెడ్డి సోమ దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా'అమీర్ లోగ్. ఎంసీ హరి, మనోజ్, శశిధర్ హీరోలుగా నటించిన ఈ చిత్రంలో వేద జలంధర్, రావణ్ నిట్టూరు, విశ్వేందర్ రెడ్డి, సాయియోగి పలువురు కీలక పాత్రలు పోషించారు. ఇప్పటి వరకు ఈ మూవీ నుంచి వచ్చిన ప్రతీ కంటెంట్ ఆడియెన్స్‌ని ఆకట్టుకుంది. ఫస్ట్ లుక్ పోస్టర్, రాహుల్ సిప్లిగంజ్ పాడిన అవ్వల్ దావత్ సాంగ్, టీజర్ ఇలా అన్నీ బజ్‌ను క్రియేట్ చేశాయి. యూత్ ఫుల్ ఎంటర్టైనర్‌గా, అవుట్ అండ్ అవుట్ కమర్షియల్ కామెడీ చిత్రంగా రాబోతోంది 'అమీర్ లోగ్'. రానా 'స్పిరిట్ మీడియా' ఈ 'అమీర్ లోగ్' మూవీ హక్కుల్ని సొంతం చేసుకుంది. ఈ మూవీని స్పిరిట్ మీడియా రెండు తెలుగు రాష్ట్రాల్లో భారీ ఎత్తున రిలీజ్ చేయబోతోంది. ఈ చిత్రాన్ని చూసి.. అందులోని కంటెంట్ నచ్చి.. రిలీజ్ చేసేందుకు ముందుకు వచ్చింది. హైదరాబాద్ గల్లీలోని ముగ్గురు స్నేహితుల మధ్య జరిగే కథ, వారి ప్రయాణాన్ని, యూత్‌కి ఇచ్చే సందేశం ప్రేక్షకుల్ని ఆకట్టుకునేలా ఉంటుంది. అందుకే స్పిరిట్ మీడియా'అమీర్ లోగ్'ను విడుదల చేయబోతోంది.

## 'పినాక' అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా విడుదల



గోల్డెన్ మెగాస్టార్ గణేష్ పుట్టినరోజు సందర్భంగా 'పినాక' చిత్ర నిర్మాతలు సినిమాలోని ఆసక్తికరమైన ప్రపంచాన్ని పరిచయం చేసే ఒక ఆకట్టుకునే కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఒక పురాతన రహస్యాన్ని ఛేదించడంలో నిమగ్నమైన గణేష్‌ను ఒక ప్రత్యేకమైన గెటప్‌లో చూపిస్తున్న ఈ పోస్టర్, సాహసం, పురాణాలు, రహస్యాలు, అద్భుతాలతో నిండిన ఒక సినిమా ప్రయాణ మైన 'పినాక' సారాంశాన్ని సంపూర్ణంగా ఆవిష్కరిస్తుంది. ఈ ఈ పోస్టర్ ఇప్పటికే ప్రేక్షకులలో ఆసక్తిని రేకెత్తించింది. ఈ సందర్భంగా చిత్రబృందం గోల్డెన్ మెగా స్టార్ గణేష్‌కు హృదయపూర్వక జన్మదిన శుభాకాం క్షలు తెలియజేస్తూ 'పినాక'లో ఆయనను ప్రేక్షకులు ఇప్పటివరకు చూడని కొత్త కోణంలో చూడబోతున్నారని, అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని తెలియజేశారు. అక్టోబర్ 2న ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కానుందని ప్రకటించారు.పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టి.జి. విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, బి. ధనంజయ దర్శకత్వం వహిస్తున్నారు.

4CTR 5:4CTR 5.qxd 7/3/2026 11:37 PM Page 1



## అబ్బాబట్లపల్లి కాలనీలో పర్యావరణ పాఠాలు

శ్రీకాళహస్తి రూరల్, జూలై 3 ప్రభాతవార్త:



శ్రీకాళహస్తి మండలం, వేదం గ్రామపంచాయతీ పరిధిలోని అబ్బాబట్లపల్లి ఎస్.టి. కాలనీలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆల్ మైనారిటీస్ అండ్ మార్జినలైజ్డ్ కమ్యూనిటీస్ ట్రస్ట్ సొసైటీఆధ్వర్యంలో, భూమిహిత ప్రాజెక్టుఆర్థిక, సాంకేతిక సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వాతావరణ మార్పులు, గ్లోబల్ వార్మింగ్, కాలుష్యం వంటి సమస్యల నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణ యొక్క ఆవశ్యకతను విద్యార్థులకు సులభ రీతిలో వివరించారు. ప్రజాసాధికారిక ట్రస్ట్ కోఆర్డినేటర్ సి.వెంకమ్మ మాట్లాడుతూ మనం పీల్చే గాలి, తాగే నీరు, తినే ఆహారం అన్నీ ప్రకృతి ప్రసాదించినవే. ప్రకృతిని కాపాడుకోకపోతే మన మనుగడే ప్రశ్నార్థకం అవుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని ఆర్గనైజర్ ఎ. కళ్యాణి సమన్వయం చేశారు.

## -టూవీలర్లు పార్క్ చేస్తే అపరాధ రుసుము వసూలు

శ్రీకాళహస్తి, జులై 3 ప్రభాతవార్త:

శ్రీకాళహస్తి ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఇష్టానుసారంగా ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేయడంపై ఆర్టీసీ యాజమాన్యం కొరడా ఝుళిపించింది. బస్టాండ్ లోపల అనధికారికంగా టూవీలర్లు పార్క్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అపరాధ రుసుము వసూలు చేస్తామని డిపో మేనేజర్ రేవతి శుక్రవారం హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధాన బస్టాండ్ ఆవరణలో ఎక్కడపడితే అక్కడ స్కూటర్లు, బైకులు పార్క్ చేయడం వల్ల ఆర్టీసీ బస్సులు ప్లాట్‌ఫారాల్లోకి రావడానికి, రివర్స్ చేయడానికి, బయటకు వెళ్లడానికి డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పండుగలు, రద్దీ సమయాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. డ్రైవర్లు హారన్ కొడుతూ, దిగి వాహనాలను పక్కకు తీయాల్సిన పరిస్థితి నెలకొంది. దీనివల్ల బస్సుల షెడ్యూల్ ఆలస్యం కావడంతో పాటు ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతు న్నారు. బస్టాండ్‌లో బస్సుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఈ సమయంలో అడ్డదిడ్డంగా పార్క్ చేసిన టూవీలర్ల వల్ల బస్సులు వాటిని ఢీకొట్టే ప్రమాదం ఉంది. ప్రయాణికులు, ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, చిన్నారులు హడావుడిగా బస్సులు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు కిందపడి గాయపడే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.బస్టాండ్ ఎదురుగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పే అండ్ పార్క్ సౌకర్యం అందుబాటులో ఉందని, ప్రయాణికులు, స్థానికులు తమ ద్విచక్ర వాహనాలను అక్కడే పార్క్ చేసి సహకరించాలని ఆమె కోరారు. రానున్న రోజుల్లో సెక్యూరిటీ సిబ్బందితో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, అనధికారికంగా పార్క్ చేసిన వాహనాలకు జరిమానా విధించడంతో పాటు, అవసరమైతే టోయింగ్‌కు తరలిస్తామని స్పష్టం చేశారు.

## జాతీయ లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోండి

శ్రీకాళహస్తి జూలై 3 ప్రభాతవార్త:



ఆంధ్రప్రదేశ్ హైకోర్టు, తిరుపతి రెడ్ శాండిల్ కోర్టు న్యాయ మూర్తి నరసింహ మూర్తి ఆదేశాల మేరకు ఈ నెల 11వ తేదీ జరుగు జాతీయ లోక్ అదాలత్ శ్రీకాళహస్తి పట్టణంలోని కోర్ట్ ఆవరణలో జరుగుతుందని చిత్తూరు ఎక్సైజ్ మెజిస్ట్రేట్ శిల్పా అన్ని శాఖల ఉన్నత అధికారుల సమావేశంలో తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎక్సైజ్ మెజిస్ట్రేట్ శిల్పా, బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు శ్రీకాళహస్తి డివిజన్ పరిధిలో ఉన్న అన్ని పోలీస్ స్టేషన్ల ఉన్నత అధికారులు, బిఎస్ఎన్ఎల్ అధికారులు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు. న్యాయమూర్తి శిల్ప మాట్లాడుతూ రాబోవు జూలై 11 వ జరుగు జాతీయ లోక్ అదాలత్ విజయవంతం చేయాలని కోరారు. రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకోవడం వల్ల సమయము, ధనము ఆదా అవుతుందని, లోక్ అదాలత్ తీర్పు అంతిమ తీర్పు, దానికి అప్పీలు ఉండదని తెలిపారు. ఈ లోక్ అదాలత్ లో అన్ని రకాల సివిల్ కేసులు రాజీ చేసుకోవచ్చు అని , రాజీకి లోబడిన క్రిమినల్ కేసులను రాజీ చేసుకోవచ్చని తెలిపారు.

## రిటైర్డ్ ఉపాధ్యాయుడు అరవ మార్టిన్‌కు నివాళులు

శ్రీకాళహస్తి,జూలై 3 ప్రభాతవార్త :



శ్రీకాళహస్తి పట్టణం 4వ వార్డు శాంతి నగర్ కాలనీలో నివాసం ఉంటున్న విశ్రాంత ఉపాధ్యాయులు అరవ మార్టిన్ ఆకస్మికంగా మరణించారు. ఈ విషాద వార్త తెలుసుకున్న మాజీ శాసనసభ్యులు శ్రీ బియ్యపు మధుసూదన్ రెడ్డి వెంటనే వారి స్వగృహానికి వెళ్లి పార్థివదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ మార్టిన్ ఒక మంచి ఉపాధ్యాయుడిగా ఎందరో విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు నాగమ్మ,మున్నా రాయల్,ముద్దుమూడి రవి, అస్లాం,రాజేంద్ర తదితరులు ఉన్నారు.

## సమస్యలను ఇంటర్మీడియట్ బోర్డ్ కమిషనర్ దృష్టికి

శ్రీకాళహస్తి, జూలై 3 ప్రభాతవార్త:

తిరుపతి జిల్లా పర్యటనలో భాగంగా చంద్రగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలికల నందు ఇంటర్మీడియట్ బోర్డ్ కమిషనర్ రంజిత్ భాషను ఉమ్మడి చిత్తూరు జిల్లా నాన్ టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కందాటి విశ్వేశ్వర్‌రెడ్డి కలిసి జిల్లా పునర్వ్యవస్థీకరణ విషయంలో పలు సమస్యలను వారి దృష్టికి శుక్రవారం తీసుకెళ్లారు. అదేవిధంగా ఎయిడెడ్ కాలేజ్ కి వచ్చిన నాన్ టీచింగ్ సిబ్బందికి సర్వీస్ రూల్స్ విషయం కూడా వారి దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. సర్వీసులు పూర్తిచేసిన వారిని కూడా ప్రమోషన్స్ వచ్చే విధంగా కృషి చేస్తానని కమిషనర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. విశ్వేశ్వర్ రెడ్డితో పాటు కమిషనర్ను కలిసిన వారిలో ఉమ్మడి చిత్తూరు జిల్లా నాన్ టీచింగ్ అసోసియేషన్ సెక్రటరీ మాధవ నివాస్ వైస్ ప్రెసిడెంట్ ప్రతాప్ గాంధీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ముని శంకర్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు మాధవరావు, షణ్ముఖ రెడ్డి, గిరి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ ఉత్తమ కార్యకర్త అవార్డు మాసారపుకు

శ్రీకాళహస్తి, జులై 3 ప్రభాతవార్త :

తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే ప్రాణమని, వారి కష్టసుఖాల్లో తాను ఎల్లప్పుడూ తోడుగా ఉంటానని జాతీయ టీడీపీ కార్యనిర్వాహక అధ్యక్షులు ఉన్నత విద్యాశాఖ మంత్రి లోకేష్ స్పష్టం చేశారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. లోకేష్ మాట్లాడుతూ.. కార్యకర్తల కష్టాన్ని పంచుకుంటాను, వారి భవిష్యత్తుకు నాదీ బాధ్యత. చదువుకుంటున్న ప్రతి యువతీ, యువకుల భవిష్యత్తుకు బాటలు వేస్తా, వారి భావితరాల భవిష్యత్తును నా భవిష్యత్తుగా భావిస్తున్నాను. కార్యకర్తలు వేసే ప్రతి అడుగుకు నేను అండగా ఉంటాను" అని హామీ ఇచ్చారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు. ఈ సమావేశంలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి, రాష్ట్ర గిరిజన సలహా మండలి సభ్యులు, పీలేరు నియోజకవర్గ పరిశీలకులు మాసారపు సుబ్బయ్య ఉత్తమ కార్యకర్త అవార్డును మంత్రి లోకేష్ చేతుల మీదుగా ప్రదానం చేశారు. శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డిఆధ్వర్యంలో ఈ సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ అవార్డును క్రమశిక్షణ, గిరిజన ప్రాంతాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న మాసారపు సుబ్బయ్య గారి నిబద్ధత, అంకితభావానికి గుర్తింపు ఈ అవార్డును అందజేసినట్లు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి తెలిపారు. పార్టీ ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తూ, క్షేత్రస్థాయిలో కార్యకర్తలకు, ప్రజలకు అందుబాటులో ఉంటూ సుబ్బయ్య చేస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. అవార్డు అందుకున్న అనంతరం మాసారపు సుబ్బయ్య మాట్లాడుతూ.. "ఈ పురస్కారం నాకు మరింత బాధ్యతను పెంచింది. నన్ను నమ్మి ఈ బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వానికి పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నా శాయశక్తులా కృషి చేస్తాను" అని అన్నారు.

## శ్రీశక్తి పీఠంలో బిజెపి రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్

రామచంద్రాపురం, జూలై 3 ప్రభాతవార్త:



రాయలచెరువు సమీపంలో వెలసియున్న శ్రీశక్తి పీఠాన్ని బిజెపి రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ డాక్టర్ కె.లక్ష్మణ్ సందర్శించారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు పీఠం నిర్వాహకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వెలసియున్న శ్వేత వారాహిదేవి, మరకతశక్తి కామాత అమ్మవార్లను దర్శించుకున్నారు. అదేవిధంగా కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద మహాభారతి స్వామి వారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో పీఠం కార్యదర్శి చంద్రశేఖర్, మేనేజర్ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## పరోపకారంతోనేజీవితం సాఫల్యం : రేహాన్

శ్రీకాళహస్తి, జూలై 3 ప్రభాతవార్త:



మనిషి జీవితం 'పరోపకారంతోనే' సాఫల్యమౌతుందని దివ్యఖురాన్, మన ప్రవక్త మహమ్మద్ సొల్లె అలా సొల్లం అన్నారని హాఫీజే ఖుర్ ఆన్ రేహాన్ సాహెబ్ అన్నారు. శుక్రవారం జామియా మస్జిద్‌లో ప్రత్యేక ప్రార్థనల సందర్భంగా ఆయన మట్లాడుతూ నేడు మనం ఇతరులకు సహాయం చేయాలనే ఆలోచనను మరిచామన్నారు.ఎవరైనా సమస్యల్లో అపదలో ఉంటే వారి గురించి చెడుగా మాట్లాడటం అలవాటైంద న్నారు. మనలో ప్రవక్తలు, దివ్యఖురాన్‌లో సూచించిన 'దయా, క్షమా, సహాయం' అనే అంశాలు మరచిపోతున్నామన్నారు. ఇతరులను ఇబ్బందులు కల్గించటం తప్ప సహాయపడే అలవాటు పూర్తిగా లేకపోవటం బాధాకరమన్నారు. దాంతో మనకు మనశ్శాంతి లోపిస్తుందన్నారు. మనం ఇక్కడ చేసే సహాయాలు మనం అందించి సహాకారాలు మనకు పరలోకంలో స్వర్గ ప్రాప్తికి దోహద పడతాయని రేహాన్ వివరించారు.

### హజ్ యాత్రకు దరఖాస్తు చేసుకోండి:

మనిషి ఆచరించాల్సిన ఐదు సూత్రాల్లో ఆర్థిక స్థోమత కల్గిన వారు రంజాన్ తరువాత హజ్ యాత్ర చేయాలని దివ్యగ్రంథం సూచిస్తుందన్నారు. ఇందుకు ప్రతి ఒక్కరు సిద్ధం కావాలన్నారు. హజ్‌యాత్రకు దరఖాస్తులు పంపటానికి ప్రభుత్వం ఈ నెల 20 చివరితేదీగా ఖరారు చేసిందని ఈ మేరకు అవకాశం ఉన్న వారు దరఖాస్తులు చేసుకోవాలని రేహాన్ సూచించారు.

## గుడిమల్లంకు డబుల్ రోడ్డు వేయించండి

-మంత్రి లోకేష్‌కు గుడిమల్లం చైర్మన్ వినతి

ఏర్పేడు, జూలై 3 ప్రభాతవార్త:



శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఏర్పేడు మండలంలో వెలసిన అనందవల్లి సమేత పరశురామేశ్వరుని ఆలయ ప్రాభవాన్ని కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఎంతో ఇనుమడింపజేయుటకు కృషి చేస్తున్నామని అయితే ఈ ఆలయానికి రేణిగుంట హైవే నుంచి గుడిమల్లం వరకు డబుల్‌రోడ్డు నిర్మాణం జరిగితే ఇంకా అభివృద్ధికి అవకాశం ఉంటుందని లోకేష్‌ను అభ్యర్థించారు. ఈ ఆలయ అభివృద్ధికి స్థానిక శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ఎంతో పట్టుదలగా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నారని లోకేష్‌కు వివరించారు. ఆలయాల అభివృద్ధికి ఆధ్యాత్మిక చింతనను పెంపొందించటానికి పట్టుదలగా పని చేస్తున్నారని లోకేష్‌కు వివరించారు. గుడిల్లం ఆలయం కుంబాభిషేకం జరిపిన తరువాత భక్తుల సంఖ్య పెరిగిందని ఎంఎల్‌ఏ చొరవతో ప్రతిరోజూ తిరుపతి, శ్రీకాళహస్తి నుంచి ఆర్‌టిసి బస్సులు నడుస్తున్నాయని వివరించారు. ఇక్కడకు హైవే నుంచి డబుల్ రోడ్డు నిర్మాణం జరిగితే ఇంకా ఆలయాభివృద్ధికి అవకాశం ఉంటుందని వివరించారు. అందుకు సానుకూలంగా స్పందించిన లోకేష్ తప్పక ఆలయాభివృద్ధికి సహాకరిస్తా మన్నారు. ఆలయనతో పాటు శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి,మండల పార్టీ అధ్యక్షుడు పేరం నాగరాజు నాయుడు, మాజీ జడ్‌పిటిసి పేరం ధనంజయులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తిలో ప్రపంచ టూ వీలర్స్ డే

శ్రీకాళహస్తి,జూలై 3 ప్రభాతవార్త:



శ్రీకాళహస్తిలో శుక్రవారం ప్రపంచ టూవీలర్స్ డేను అసోసియేషన్ సారధ్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిసీడ్స్ కార్యాలయం నుంచి ఎంజిఎం వరకు భారీ ర్యాలి నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు అంజద్‌బాషా సారధ్యంలో జాతీయ టూ వీలర్స్ డేను నిర్వహించారు. ఈ ర్యాలిని శ్రీకాళహస్తి పట్టణ అధ్యక్షుడు జి.విజయకుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు తమ డిమాండ్లను వివరిస్తూ రాష్ట్రంలో సుమారు 8 లక్షల మంది కార్మికులు ఉన్నట్లు వివరించారు. మెకానికల్స్ ఎదుర్కొంటున్న సమస్యలున్నాయన్నారు. కార్మికులకు గుర్తింపు కార్డులు ప్రభుత్వం అందించాలని కోరారు.వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. టూవీలర్స్ వెల్ఫేర్ బోర్డు ద్వారానే ప్రభుత్వ గుర్తింపు కార్డుఉన్న ప్రతి కార్మికునికి ప్రమాద బీమా వైద్యసదుపాయం,సాధారణ, ప్రమాదవశాత్తు జరిగే మరణాలకు ఆయా కుటుంబాలను ఆదుకోనుటకు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఇక నిరుద్యోగులుగా ఉన్న మెకానికల్స్‌కు ముద్రారుణాలు రూ.3లక్షలు మంజూరు చేయాలని కోరారు. ప్రతి జిల్లా హెడ్ క్వార్టర్స్ అసోసియేషన్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరారు. పార్టీకిఅండగా ఉంటున్న టూవీలర్,3,4,8 వీలర్స్ కార్మికులకుసంక్షేమ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆదుకోవాలని కోరారు. ఈకార్యక్రమాల్లో అసోసియేషన్‌కు చెందిన అంజద్ సాహెబ్‌తోపాటు మెకానికల్ అసోసియేషన్‌కు చెందిన జయ, మోహన్, కిషోర్,అయ్యప్ప ,శంకర్, బాబు, మహేష్, కిషోర్, ఉమాపతి, గోపి,తెలుగుదేశం పార్టీకి చెందినమిన్నల్‌రవి, ఉమేష్‌రావు, కంఠా రమేష్, కాసరం రమేష్, వజ్రం కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రులు,ఎంఎల్‌ఏలతో కిట కిట

శ్రీకాళహస్తి,జూలై 3 ప్రభాతవార్త:



శ్రీకాళహస్తీశ్వరాలయం శుక్రవారం రాజకీయ నాయకులతో కిట కిట లాడింది. కేంద్ర మంత్రులు,రాష్ట్ర ఎంఎల్‌ఏలు పలువురు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. వచ్చిన వారికి ఆలయ ఇఓ బికె వవెంకటేశులు, ప్రోటోకాల్ ఎ ఇఓ లోకేష్‌బాబు, ఆలయ ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్లు వవెంకటస్వామి, హరియాదవ్‌లు పర్యవేక్షించారు. ఆలయానికి భక్తుల తాకిడి లేక పోవటంతో వచ్చిన విఐపిలు ప్రశాంతంగా దర్శనం చేసుకున్నారు.అలాగే వారికి ప్రోటోకాల్ ఏర్పాటు చక్కగా నిర్వహించారు. కేంద్ర ఆయుష్ మంత్రిత్వశాఖ మంత్రి ప్రతాప్‌రావు జాదవ్,కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు,ఆహార,ప్రజా పంపిణి శాఖ మంత్రి ప్రహ్లాద్‌జోషి, పార్లమెంటరీ వ్యవహారాలు సహాయ మంత్రి డాక్టర్ ఎల్‌మురుగన్,అలాగే ఆంధ్రప్రదేశ్ తెలుగుదేశం పొన్నూరు శాసనసభ్యుడు ధూళిపాళ నరేంద్రలు కుటుంబసభ్యులతో రాగా వారికి దక్షిణగోపురం వద్ద ఆలయ మర్యాదలతో ప్రోటోకాల్ ఎఇఓ లోకేష్‌బాబు, ఎపిఆర్‌ఓ రవిలు వేదపండితులతో స్వాగతం పలికారు.వారిలో మంత్రి మురుగన్ ఆలయంలో నిర్వహించే రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకున్నారు.కాగా అతిథులకు స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. తరువాత మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వారికి వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు స్వామి అమ్మవార్ల చిత్రపటాలను ఇఓ వెంకటేశు అందించారు. కాగా ఏర్పాట్లును ఆలయ ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి, పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్‌లు పర్యవేక్షించారు

## 10 మత్స్యకారుల సమావేశం

శ్రీకాళహస్తిరూరల్,జూలై 3 ప్రభాతవార్త:

శ్రీకాళహస్తి మండలంలోని అతి పెద్ద చెరువుఅయిన తొండమనాడు చెరువుకు సంబంధించిన చేపలు పట్టుకునేందుకు హక్కుల అప్పగింతకు సంబంధించి ఈ నెల 10న సమావేశం ఏర్పాటు చేసినట్లు మత్స్యశాఖ ప్రత్యేకాధికారి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బైదేవతమ్మ మత్స్యకారులు సహాకార సంఘం సారధ్యంలో ఉదయం 11గంటలకు వెంకటాపురం గ్రామంలోని వినాయక స్వామి ఆలయ ప్రాంగణంలో వేలం పాటలు నిర్వహించబడుతుందని తెలిపారు.

## విద్యార్థుల చే ప్లాస్టిక్ వ్యతిరేక ర్యాలీ

శ్రీకాళహస్తి, జులై 3 ప్రభాతవార్త:



అఖిల భారత 72వ సహకార వారోత్స వాలను పురస్కరించుకొని శ్రీకాళహస్తి మండలం కాపు గున్నేరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పిఎసిఎస్) శుక్రవారం ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కాపు గున్నేరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలకు చెందిన 200 మంది విద్యార్థినీ, విద్యార్థులు ఈ ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్లాస్టిక్‌ను బహిష్కరిద్దాం భూమాతను రక్షిద్దాం, ఒక్కసారి వాడే ప్లాస్టిక్ వద్దే వద్దు, గుడ్డ సంచి ముద్దు, ప్లాస్టిక్ కవర్ వద్దు అంటూ విద్యార్థులు చేసిన నినాదాలు గ్రామ వీధుల్లో మారుమోగాయి. ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల నేల కలుషితమై పంటలు పండకపోవడం, కాలువలు మూసుకుపోయి వరదలు రావడం, పశువులు తిని మృత్యువాత పడటం వంటి అంశాలను చిత్రాలతో కూడిన ప్లకార్డుల ద్వారా ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమానికి సబ్ డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీసర్ విజయ్ కుమార్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ర్యాలీని ప్రారంభించారు. ఆయనతో పాటు సహకార శాఖ ఆఫీసర్ పార్థిబన్, తిరుపతి జిల్లా కోఆపరేటివ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు పప్పు చిరంజీవి రెడ్డి పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సహకార ఉద్యమం కేవలం రుణాలు, పొదుపులకే పరిమితం కాదు. సమాజంలో మార్పు తీసుకురావడం కూడా మా బాధ్యత అని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిషేధించిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతి పౌరుడు నడుం బిగించా లన్నారు. మనం వేసే ఒక్క మంచి అడుగు భావితరాలకు మేలు చేస్తుంది. ప్రతి షాపులో గుడ్డ సంచులు అందుబాటులో ఉంచాలి. ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు స్టీల్ బాటిల్, క్లాత్ బ్యాగ్ తీసుకెళ్లడం అలవాటు చేసుకోవాలి అని పిలుపునిచ్చారు.

# తిరుపతి డివిజన్

## కృష్ణమూర్తికి కులపతి భూషణం బిరుదు

-సంస్కృత వర్సిటీ వీసీకి అరుదైన గౌరవం

-కర్ణాటక మంత్రి, పీఠాధీశుల చేతుల మీదుగా సత్కారం

తిరుపతి విద్య, జూలై 3 ప్రభాతవార్త:



తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం కులపతి (వైస్ చాన్సలర్) ప్రొఫెసర్ జి.యస్.ఆర్ కృష్ణమూర్తికి అరుదైన గౌరవం దక్కింది. సంస్కృత భాషాభివృద్ధికి ఆయన చేస్తున్న విశేష సేవలకు గుర్తింపుగా అఖిలభారతీయ వీరశైవశివాచార్యస్థాన పీఠం వారు ఆయనను కులపతి భూషణం బిరుదుతో ఘనంగా సత్కరించారు. కర్ణాటకలో జరిగిన ఒక ఆధ్యాత్మిక,సాంస్కృతిక కార్యక్రమంలో అఖిలభారతీయ వీరశైవశివాచార్యస్థాన పీఠాధీశులు పూజ్యశ్రీ చంద్రశేఖరశివాచార్య స్వామిజీ, మల్లికార్జున శివాచార్య స్వామిజీ, రేవణ సిద్ధశివాచార్య స్వామిజీలతో పాటు కర్ణాటక రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రే, దావణగెరె శాసనసభ్యుడు (ఎమ్మెల్యే) సమర్థ్ లు సంయుక్తంగా ప్రొ. జి.యస్.ఆర్ కృష్ణమూర్తికి ఈ ప్రతిష్ఠాత్మక బిరుదును ప్రదానం చేసి ఘనంగా సన్మానించారు. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ద్వారా ప్రొ. కృష్ణమూర్తి సంస్కృత భాషా వ్యాప్తికి, నూతన నిర్మాణాత్మక పరిశోధనలకు మరియు భారతీయ సంస్కృతి సంప్రదాయాల సంరక్షణకు అంకితభావంతో చేస్తున్న కృషిని ఈ సందర్భంగా పీఠాధీశులు, ప్రముఖులు కొనియాడారు. కులపతికి ఈ అరుదైన పురస్కారం దక్కడం పట్ల జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్, అధ్యాపక బృందం, అధికారులు, సిబ్బంది మరియు విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాభినందనలు తెలియజేశారు.

## నేడు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో జనవాణి

తిరుపతి విద్య, జూలై 3 ప్రభాతవార్త:



నగర ప్రజల సమస్యల తక్షణ పరిష్కారం కోసం తిరుపతి శాసనసభ్యుడు ఆరణి శ్రీనివాసులు ఆధ్వర్యంలో శనివారం ఉదయం జనవాణి కార్యక్రమం నిర్వహించనున్నారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఈ ప్రజా దర్బార్ జరగనుంది. నగరంలోని వివిధ డివిజన్లకు చెందిన ప్రజలు తమ పరిధిలోని వ్యక్తిగత, సామాజిక సమస్యలను, వినతు లను ఈ సందర్భంగా నేరుగా ఎమ్మెల్యేకు విన్నవించుకోవచ్చు. ప్రజల నుంచి వచ్చే అర్జీలపై తక్షణమే స్పందించి, వాటిని పరిష్కరించేం దుకు వీలుగా జనవాణి కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు కూడా భాగస్వామ్యం కానున్నారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

## త్వరలో తిరుపతిలో సంస్కృత అకాడమీ

-వీసీ ప్రొ.కృష్ణమూర్తితో అకాడమీ డైరెక్టర్ శరత్ చంద్ర చర్చలు

తిరుపతి విద్య, జూలై 3 ప్రభాతవార్త:



తిరుపతిలో సంస్కృత భాషాభివృద్ధి కోసం ప్రత్యేకంగా సంస్కృత అకాడమీని స్థాపించే అంశంపై ఉన్నత స్థాయి చర్చలు జరిగాయి. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ ప్రొ. జి.యస్.ఆర్ కృష్ణమూర్తితో ఆంధ్రప్రదేశ్ తెలుగు మరియు సంస్కృత అకాడమీ డైరెక్టర్ డాక్టర్ ఆర్.డి. శరత్ చంద్ర శుక్రవారం వీసీ చాంబర్‌లో ప్రత్యేకంగా భేటీ అయ్యారు.గత వారం విజయవాడలో వీసీ ప్రొ.కృష్ణమూర్తి అకాడమీకి వినతిపత్రం సమర్పించి, తిరుపతిలో సంస్కృత అకాడమీ స్థాపనకు కృషి చేయాలని కోరిన నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సందర్భంగా తిరుపతిలో ప్రత్యేక అకాడమీ ఏర్పాటుపై ఇరువురు విస్తృతంగా చర్చించారు. దీనిపై అకాడమీ డైరెక్టర్ శరత్ చంద్ర సానుకూలంగా స్పందిస్తూ, త్వరలోనే ఉన్నత స్థాయి సమాలోచనలు జరిపి అకాడమీ ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.అత్యంత త్వరగా సంస్కృత అకాడమీని ఏర్పాటు చేసి భారతీయ సంస్కృతి, సనాతన ధర్మం మరియు విజ్ఞాన వ్యాప్తికి కృషి చేయాలని వీసీ కోరారు. ఈ సందర్భంగా అకాడమీ డైరెక్టర్‌కు విశ్వవిద్యాలయం తరపున ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## మట్టిలోని మాణిక్యాలు...విద్యార్థినులు

-ఇంటర్ విద్యామండలి డైరెక్టర్ రంజిత్ భాష

తిరుపతి విద్య, జూలై 3 ప్రభాతవార్త:



మట్టిలోని మాణిక్యాల వంటి గ్రామీణ ప్రాంత విద్యార్థినుల ప్రతిభను వెలికితీస్తూ, ప్రైవేటు విద్యా సంస్థలకు ధీటుగా ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న చంద్రగిరి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల జిల్లాకే ఆదర్శంగా నిలిచిందని ఇంటర్మీడియట్ విద్యామండలి డైరెక్టర్ (కమీషనర్) రంజిత్ భాష కొనియాడారు. శుక్రవారం ఆయన స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ నేరుగా తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థినులతో ముఖాముఖి మాట్లాడారు. వారి విద్యా ప్రమాణాలను, అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కళాశాల గతంలో సాధించిన ఉత్తమ ఫలితాలను విశ్లేషించి, భవిష్యత్తులో వంద శాతం ఫలితాల సాధన కోసం అధ్యాపక సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ప్రయోగశాలలు (ల్యాబ్స్), గ్రంథాలయం, అనుబంధ ఆటస్థలంతో పాటు వసతి గృహాన్ని (హాస్టల్) ఆయన నిశితంగా పరిశీలించి, అక్కడి వసతులపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, విద్యార్థినుల సౌకర్యార్థం ప్రభుత్వ సహాయ సహకారాలతో రాబోయే రోజుల్లో మరిన్ని నిధులు కేటాయించి, కళాశాల మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పరిమిత వనరులతోనే అద్భుత ఫలితాలు సాధిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపక బృందాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యవేక్షణ అధికారి జి. రాజశేఖరరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ కె. వెంకటాచలపతి, విద్యాసంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంటర్ కమిషనర్‌కు నాన్‌టీచింగ్ సిబ్బంది వినతి

తిరుపతి విద్య, జూలై 3 ప్రభాతవార్త:



తిరుపతి జిల్లా పర్యటనలో భాగంగా చంద్రగిరి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు విచ్చేసిన ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్ రంజిత్ భాషాని ఉమ్మడి చిత్తూరు జిల్లా నాన్‌టీచింగ్ అసోసియేషన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా పునర్వ్యవస్థీకరణ నేపథ్యంలో నాన్ టీచింగ్ సిబ్బంది ఎదుర్కొంటున్న పలు సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా, ఎయిడెడ్ కళాశాలల నుండి ప్రభుత్వ పరిధిలోకి వచ్చిన నాన్‌టీచింగ్ సిబ్బంది సర్వీస్ రూల్స్ వ్యవహారాన్ని ప్రతినిధులు ఆయనకు వివరించారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ.. సర్వీస్ రూల్స్ ప్రక్రియను పూర్తి చేసి, అర్హులైన సిబ్బంది అందరికీ త్వరితగతిన ప్రమోషన్లు (పదోన్నతులు) దక్కేలా తప్పకుండా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కమిషనర్‌ను కలిసిన వారిలో ఉమ్మడి చిత్తూరు జిల్లా నాన్ టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు విశ్వేశ్వర రెడ్డి, సెక్రటరీ మాధవ నివాస్, వైస్ ప్రెసిడెంట్ ప్రతాప్ గాంధీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ ముని శంకర్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు మాధవరావు, షణ్ముఖ రెడ్డి, గిరి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతి!

తొట్టంబేడు,జూలై 3 ప్రభాతవార్త:



శ్రీకాళహస్తి ఆర్‌టిసి బస్టాండు సమీపంలోని ఎన్‌టిఆర్ సర్కిల్ వద్ద గురువారం రాత్రి ఓ గుర్తుతెలియని వ్యక్తి(60)లు అపస్మారక స్థితిలో పడి ఉండగా పరిసరాల్లోని ప్రజలు గుర్తించి 108కు సమాచారం అందించారు. ఆతన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స పొందుతూ మరణించినట్లు సిఐ నాగరాజు శుక్రవారం మీడియాకు తెలిపారు. ఎవరైనా గుర్తిస్తే సమాచారం అందించాలని 9440900008కు సమాచారం అందించాలని సిఐ నాగరాజు కోరారు.

4CTR 6:4CTR 6.qxd 7/3/2026 11:39 PM Page 1



## శ్రీవకుళమాత సన్నిధిలో ఘనంగా...

అక్షర గోవిందం...అన్నప్రాశనం

తిరుపతిరూరల్, జులై 3 ప్రభాతవార్త:



చిన్నారుల విద్యారంభం, జీవితానికి శుభారంభం కలగాలనే దైవ సంకల్పంతో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో తిరుపతిలోని శ్రీవకుళామాత ఆలయంలో అక్షర గోవిందం – అన్నప్రాశనం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా ఘనంగా ప్రారంభించారు. ఈ వినూత్న కార్యక్రమం భక్తుల్లో విశేష స్పందన రేపింది. ఈ కార్యక్రమంలో టిటిడి ఛైర్మెన్ బిఆర్ నాయుడు, ఈవో ఎం.రవిచంద్ర పాల్గొని, చిన్నారులకు ఆశీర్వచనాలు అందించారు. చిన్నారుల తొలి అక్షరం 'గోవింద' నామంతో ప్రారంభమైతే విద్యాభ్యాసం విజయవంతంగా కొనసాగుతుందనే విశ్వాసంతో ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఛైర్మెన్ మాట్లాడుతూ అక్షరాభ్యాసం, అన్నప్రాశనం ప్రతి చిన్నారి జీవితంలో అత్యంత పవిత్రమైన సంస్కారాలు అని పేర్కొన్నారు. దైవస్మరణతో ప్రారంభమైన విద్య జీవితాంతం శ్రేయస్సును అందిస్తుందని తెలిపారు. ప్రతి హిందూ కుటుంబం ఈ దివ్య అవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రత్యేక పూజల అనంతరం చిన్నారులకు 'అక్షర గోవిందం కిట్'ను ఉచితంగా అందజేశారు. ఈ కిట్‌లో రాతపలక, బలపాలు, అక్షింతలు, పసుపు, కుంకుమ, శ్రీవారి కంకణం, ఫటిక బెల్లం, అలాగే శ్రీ వేంకటేశ్వరస్వామి, శ్రీవకుళమాత, శ్రీపద్మావతి అమ్మవారు, శ్రీ సరస్వతిదేవి చిత్రపటాలు, గోవింద నామాలు, సుప్రభాతం, పెద్దబాలశిక్ష వంటి పూజా, విద్యా సామాగ్రి సమగ్రంగా ఉన్నాయి. యాత్రికుల సౌకర్యార్థం రూ.2కోట్ల రుపాయాలతో నిర్మించిన వసతి సముదాయాన్ని టిటిడి ఛైర్మెన్ బిఆర్ నాయుడు, ఇవో రవిచంద్ర సంయుక్తంగా ప్రారంభించారు. భక్తులకు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించేందుకు ఈ నిర్మాణం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అధికారులు తెలిపారు. 'అక్షర గోవిందం – అన్నప్రాశనం' కార్యక్రమం ద్వారా చిన్నారుల జీవితానికి ఆధ్యాత్మిక పునాది వేయడం టిటిడి లక్ష్యమని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమం భవిష్యత్తులో మరింత విస్తృతంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, టిటిడి బోర్డు సభ్యులు పనబాక లక్ష్మీ, భానుప్రకాష్‌రెడ్డి, దర్శన్, ఎన్.సదాశివరావు, డాలర్ దివాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యతా ప్రమాణాలతో తరగతి గదులు

–పాఠశాల మౌళిక సదుపాయాల కమీషనర్ రంజిత్ భాషా

చంద్రగిరి, జులై 3 ప్రభాతవార్త:



తరగతి గదుల నిర్మాణంలో నాణ్య తా ప్రమాణాలు పాటించా లని పాఠశాల మౌళిక సదుపాయాల కమీషనర్ రంజిత్ భాషా అన్నారు. స్థానిక శ్రీ పద్మావతీ జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఎంబిఎంబి ఫేజ్ –2లో మంజూరైన అసం పూర్తి తరగతి గది భవన నిర్మాణా పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఓ శ్రీవరం లలితకుమారి, ఎంఈఓ 2 భాస్కర్‌బాబు మనబడి మన భవిష్యత్తు పనుల పురోగతిని ఆయనకు వివరించారు. ఈ క్రమంలో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూనే నిర్ణీత గడువు లోపు పునులు పూర్తి చేయాలని పాఠశాల హెచ్ఎం వెంకటరమణ రెడ్డిని, అధికారులను ఆదేశించారు. మనబడి మన భవిష్యత్తు పనులలో పూర్తికాని అధనపు తరగతి గదుల నిర్మాణ పనులను పూర్తి చేయడానికి రీ ఎస్టిమేషన్ వేసి పోర్టల్లో సబ్మిట్ చేయాలని డిఈ, ఏఈలను ఆదేశించారు. అంతకు ముందు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను సందర్శించిన ఆయన ఈ ఏడాది నుండి ఇంటర్మీడియెట్ విద్యావిధానంలో మారిన పరిస్థితులపై విద్యార్థినుల నుండి అభిప్రాయాలను అడిగితెలుసుకున్నారు. గతంలో మార్కుల విధానం, ప్రస్తుతం మారిన మార్కుల విధానంపై విద్యార్థులలో వత్తిడిని తగ్గించేందుకై విద్యాశాఖ తరపున వర్క్‌బుక్‌లు అందించనున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖ అధికారి జి.రాజశేఖర్ రెడ్డి కళాశాలలోని మౌళిక సదుపాయాలు, విద్యార్థినుల ప్రతిభ, కళాశాల అందిస్తున్న సహాయ సహకారాలను ఆయనకు వివరించారు.

## 2 వేలకు పైగా భక్తులు వచ్చే అవకాశం

జెఈఓ డాక్టర్ శరత్‌కుమార్

చంద్రగిరి, జులై 3 ప్రభాతవార్త:



టిటిడి అనుబంధ శ్రీ కోదండరామస్వామి వారి ఆలయ ప్రాంగణంలో నిర్వహించతలపెట్టిన శ్రీ మహాలక్ష్మీ దీపపూజకు సమర్ధవంతంగా ఏర్పాట్లు చేయాలని జెఈఓ డాక్టర్ శరత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. స్థానిక శ్రీ కోదండరామాలయ ప్రాంగణంలో దీపపూజకు చేపట్ట వలసిన ఏర్పాట్లపై ఆయన అధికారులతో కలసి పరిశీలించారు. ఆలయ పవిత్రత, ఆధ్యాత్మిక చింతనతో కూడిన వాతావరణంలో దీపపూజ నిర్వహించాలన్నారు. కనీసం 2 వేల మందికి పైగా మహిళలు హాజరయే అవకాశం వున్నందున భక్తులకు అవసరమైన త్రాగునీరు, చలువ పందిళ్ళు, క్యూలైన్లు, మైక్‌సెట్లు, భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టం చేయాలన్నారు. ఏర్పాట్లలో ఎక్కడా ఎటువంటి లోపాలు లేకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఈ మనోహరం, ఈఈ మల్లికార్జున ప్రసాద్, డిఈ (విద్యుత్) సరస్వతి, విజిఓ గిరిధర్, ఆలయ డిప్యూటీ ఈఓ నాగరత్న, ఎస్‌విబిసి సిపిఓ శ్రీశ్రీ, టిటిడి ఛీఫ్ పిఆర్ఓ రవి, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా కళ్యాణ వెంకన్న విహారం

చంద్రగిరి, జులై 3 ప్రభాతవార్త:



శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శుక్రవారం స్వామివారి జన్మ నక్షత్రం శ్రవణ నక్షత్రం సందర్భంగా తిరుచ్చి వాహన సేవ వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు స్వామివారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి, తోమాల అర్చనాధి నిత్యకైంకర్యాలను ఆగమోక్తంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత స్వామివారు విశేష అలంకృతులై తిరుచ్చి వాహనంపై అధిష్టించి తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఇఓ ఎం.గోపినాధ్, సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, అర్చకులు ఆంజనేయాచార్యులు,పరిచారిక ఉదయ్ తేజ, సెక్యూరిటీ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## గడువులోపు ఎస్ఐఆర్ దరఖాస్తులను అందజేయండి.!

ఏఈఆర్ఓ మధుసూదన్ రావు

రామచంద్రాపురం, జులై 3 ప్రభాతవార్త:



నిర్దష్ట గడువు లోపు ఎస్ఐఆర్ దరఖాస్తులను బిఎల్ఓలకు అందజేయాలని ఏఈఆర్ఓ మధుసూదన్ రావు అన్నారు. శుక్రవారం కన్నికాపురం ఏపడబ్ల్యు ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్ళి ఎస్ఐఆర్ ఫారాలలో బిఎల్ఓలు నింపిన సమాచారాన్ని పరిశీలించారు. ప్రతి ఓటరు తమ వివరాలను బిఎల్ఓలకు అందించి సహకరించాలన్నారు. వివరాలు తెలియని జేయని వారు తమ ఓటు హక్కు కోల్పోయే అవకాశం వుందన్నారు.

## మత్స్యపరిశ్రమ రాయితీకి లంచం

–రూ.ఒకలక్ష తీసుకుంటూ ఏసిబికి డిడి రెడ్డన్న

తిరుపతి,జులై 3ప్రభాతవార్త:



కేంద్రప్రభుత్వం అందించే రాయితీని లబ్ధిదారులు ఉచితంగా పొందడానికి లంచం డిమాండ్ చేసిన మత్స్యశాఖ ఉప సంచాలకుడు రెడ్డన్న అవినీతి నిరోధకశాఖ(ఏసిబి) అధికారులకు పట్టుబడ్డాడు. ఒకలక్ష రూపాయలు తీసుకుంటూ తన స్నేహితుడి ద్వారా రెడ్డన్న అవినీతి బట్ట బయలైంది. ఏసిబి అధికారుల వివరాలమేరకు తిరుపతి రూరల్ మల్లంగుంటలో నివాసముంటున్న సుభాన్ భార్య పేరున 50లక్షలు రూపాయలు అంచనాతో మల్లంగుంటలోనే మత్స్య పరిశ్రమ క్రింద చేపలు, రొయ్యలు పెంచడం కోసం కార్యాచరణ రూపొందించాడు. ఇందుకు సంబంధించిన పరిశ్రమ స్థాపన అంచనాను తయారుచేశాడు. 50లక్షలు రూపాయలు పెట్టుబడితో ఏర్పాటుచేసే ఈ పరిశ్రమకు ప్రధానమంత్రి యోజన పథకం క్రింద 60శాతం రాయితీకి దరఖాస్తుచేసుకున్నాడు. ఈ దరఖాస్తులను తిరుపతినగరంలోని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి కార్యాలయంలోని డిప్యూటీ డైరెక్టర్ రెడ్డన్నను కలిశాడు. తన పరిశ్రమకు సంబంధించిన రికార్డులను ,దరఖాస్తులను సమర్పించాడు. అయితే రాయితీ కోసం తన సంతకం చేయడానికి 6లక్షలు రూపాయలు లంచం ఇవ్వాలని రెడ్డన్న కొంతకాలం క్రిందట డిమాండ్ చేశాడు. అయితే బాధితులు అంతపెద్దమొత్తంలో ఇచ్చుకోలేమని మొరపెట్టుకున్నారు. చివరకు 3లక్షలు రూపాయలు లంచం నగదుగా ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. బాధితుడు సుభాన్ చేసేది లేక తిరుపతిలోని ఏసిబిఅధికారులకు ఫిర్యాదు చేశాడు. ఏసిబి డిఎస్పీ సీతారామారావు సిబ్బంది సూచనలతో శుక్రవారం ఉదయం ఒకలక్ష రూపాయలు లంచం నగదు తీసుకుంటూ పట్టుబడ్డాడు. ఆహారం,వాణిజ్య ప్రయోజనాల కోసం కృత్రిమ ఆవరణలలో (ట్యాంకులు) చేపలను పెంపకం చేసే ప్రదేశ: కోసం ఈ లంచం ఇచ్చుకోవాల్సి రావడం కొసమెరుపు.

## కువైట్ విశ్వవిద్యాలయం...ఆచార్య మారి బసప్ప అవగాహన



తిరుపతి,జులై 3ప్రభాతవార్త:

తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం అప్లైడ్ మైక్రోబయాలజీ విభాగం ఆధ్వర్యంలో కువైట్ విశ్వవిద్యాలయం డెంటిస్ట్రీ విభాగంలోని బయోక్లినికల్ సైన్సెస్ శాఖకు చెందిన ప్రముఖ శాస్త్రవేత్త ప్రొఫెసర్ మారిబసప్ప కర్చెడ్‌తో పరస్పర చర్చా కార్యక్రమం జరిగింది. కార్యక్రమం ముగింపులో నిర్వహించిన ప్రశ్నోత్తర సమావేశంలో విద్యార్థులు, పరిశోధన విద్యార్థులు పరిశోధన విధానాలు, ఉపాధి అవకాశాలు, విదేశాల్లో ఉన్నత విద్యాభ్యాసం, పరిశోధన , ఫెలోషిప్ అవకాశాలపై తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కా ర్యక్రమం అనంతరం సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ డీన్ ప్రొఫెసర్ పి. విజయలక్ష్మి ,ఎస్పీఎంవీవీ ,కువైట్ యూనివర్సిటీల మధ్య భవిష్యత్ అకాడమిక్, పరిశోధనా సహకారాన్ని విస్తరించే అవకాశాలపై ప్రొఫెసర్ మారిబసప్ప కర్చెడ్‌తో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎం.ఎస్‌సి. అప్లైడ్ మైక్రోబయాలజీ ఇండస్ట్రియల్ మైక్రోబయాలజీ బయోకెమిస్ట్రీ విద్యార్థులు, పరిశోధన విద్యార్థులు, విభాగాధిపతి డాక్టర్ పి. సువర్ణలతా దేవి, అధ్యాపకురాళ్ళు డాక్టర్ పి. ఉమామహేశ్వరి దేవి, డాక్టర్ చండి కుమారి, డాక్టర్ . ఎం. వాణి, డాక్టర్ కె. జ్ఞానేశ్వరి, డాక్టర్ కె. రుక్మిణి పాల్గొన్నారు.

## దామినేడులో 50కోట్లు విలువచేసే ప్రభుత్వభూమి ఆక్రమణ

–భూకబ్జాదారుల నుండి గుజ్జారెడ్డి గుంటను పరిరక్షించండి

–సిపిఐ నాయకులు

తిరుపతిరూరల్,జులై 3 ప్రభాతవార్త:



తిరుపతిరూరల్ మండలం దామినేడులో రూ.50కోట్ల రుపాయాలు విలువచేసే గుజ్జారెడ్డికుంట పోరంబోకు స్థలాన్ని కాపాడాలని సిపిఐ నగర కార్యదర్శి విశ్వనాథ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సిపిఐ నాయకులు తిరుపతిరూరల్ తహశీల్దార్‌ను వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విశ్వనాథ్ మాట్లాడుతూ తిరుపతిరూరల్ దామినేడు లెక్కదాఖల సర్వేనెంబర్ 91/4 మూడెకరాల 32 సెంట్లు భూమి, సుమారు 50కోట్ల ఖరీదు చేస్తుందన్నారు. నకిలీపత్రాలు సృష్టించి కోట్లాది రూపాయాలకు వ్యాపారం పెడుతున్నారని, ప్రతిరోజు కొంతమంది రియల్ ఏస్టేట్ వ్యాపారస్తులు చూస్తూ పోతున్నారని, భూమి కొనుగోలుకు బేరాలు చేస్తున్నారన్నారు. ఈ భూమి అనేక సంవత్సరాలుగా ప్రభుత్వభూమిగా ఉన్నదని, స్వయానా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తిరుపతి బహిరంగ సభలో గుజ్జాగుంట పేరు ప్రస్తావన కూడా తెచ్చారని, అలాంటి కుంట పోరంబోకు భూమిని కోట్లాది రుపాయాలకి వ్యాపారం జరుగుతుందన్నారు. రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం చేయకుండా గుజ్జారెడ్డి గుంట పోరంబోకు స్థలాన్ని కాపాడాలని కోరారు. లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో అందోళన చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర కార్యవర్గ సభ్యులు శివ, పద్మనాభరెడ్డి, రాజా, జింక నాగరాజు, శ్రీనివాస్, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

## అసత్యపు వ్యాఖ్యలు వెనక్కి తీసుకోకపోతే...పరువునష్ట దావా

–తెలుగు, సంస్కృత అకాడమీ ఛైర్మెన్ ఆర్.డి.విల్సన్ అలియాస్ శరత్‌చంద్ర

తిరుపతిరూరల్,జులై 3 ప్రభాతవార్త:



తెలుగు, సంస్కృత అకాడమీపై మాజీ ఛైర్మెన్ లక్ష్మీపార్వతి చేసిన అసత్యపు ఆరోఫణలను వెనక్కి తీసుకోకపోతే పరువు నష్ట దావా వేస్తామని తెలుగు, సంస్కృత అకాడమీ ఛైర్మెన్ ఆర్.డి. విల్సన్ అలియాస్ శరత్ చంద్ర హెచ్చరించారు. శుక్రవారం ఎస్వీ గోశాల అవరణలో ఉన్న తెలుగు అకాడమీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. లక్ష్మీపార్వతి హయాంలో జరిగిన అవకతవకలపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. తమిళనాడు తరహాలో ఆంధ్రలో వర్చువల్ అకాడమీ పెడితే బావుంటుందనే ప్రతిపాదన ఉందన్నారు. దీనికి డి పి ఆర్ తయారు చెయ్యమని ఇచ్చిన మంత్రి ఆదేశాల మీద మాత్రమే తయారు చేశాం తప్పా..ఒక్క రుపాయి కూడా అకాడమీ నుండి ఖర్చు చేయ్యలేదన్నారు. సమాచార సాంకేతిక విప్లవంలో భాగంగా సోషల్ మీడియా ప్రజలకు అత్యంత చేరువగా ఉంటే, యూట్యూబ్ ఛానల్ గురించి పూర్తిగా తెలుసుకొని మాట్లాటం మంచిదన్నారు. తిరుపతిలో సంస్కృతి అకాడమీ అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. విజయవాడలో తెలుగు, సంస్కృత అకాడమీ అభివృద్ధికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రవేట్ విద్యా సంస్థలలో కూడా తెలుగు అకాడమీ బుక్స్‌నే వినియోగిం చాలన్నారు. అకాడమీ బుక్స్ తయారీ వల్ల రూ.20కోట్లు ఆధాయం వచ్చిందన్నారు. నాడు – నేడు పేరుతో గత ప్రభుత్వం స్కూల్స్ రంగులు వేశారే తప్ప, విద్యాభివృద్ధి జరగలేదని విమర్శించారు. మంత్రి లోకేష్ హయాంలో అంతర్జాతీయ విలువలతో పాఠశాలలో కనీసం జిల్లాకు ఒకటి ఏర్పాటు చేయాలని అనుకోవడం ఆయన పనితీరుకు నిదర్శమని పేర్కొన్నారు. లోకేష్ అకాడమీకి మార్గదర్శనం చేస్తారు తప్పా...ఎప్పుడూ అకాడమీ కార్యక్రమాల్లో జోక్యం చేసుకోరని, లోకేష్‌పై కూడా తప్పుడు ప్రచారం చేయడం తగదన్నారు. తెలుగు అకాడమీకి తెలంగాణా నుండి రావాల్సి నిధులు రాబట్టడానికి లేఖలు వ్రాసినట్టు తెలిపారు. అకాడమీ ప్రతిష్ట దెబ్బ తీసేలా మాట్లాడిన లక్ష్మీ పార్వతి తన వ్యాఖ్యలు ఉప సంహరించుకోకపోతే పరువు నష్టం దావాతో పాటు అట్రాసిటీ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

# తిరుపతి డివిజన్

## పల్లమాలలో ఘనంగా సీతాలమ్మ ఉత్సవాలు



బుచ్చినాయుడు కండ్రిగ, జులై 3 ప్రభాతవార్త:

పల్లమాల గ్రామంలో నెలకొని ఉన్న సీతాలమ్మ దేవతా ఉత్సవాలు శుక్రవారం ఘనంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు మూడు రోజులు పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు సీతాలమ్మ దేవతను పూలమాలతో అలంకరించి పూజారి చేత పూజా కార్యక్ర మాలు నిర్వహించి అమ్మలు పోసి ఉత్సవాలను జరుపుకోవడం జరిగింది. ఈ ఉత్సవాల్లో మహిళలు, పిల్లలు పెద్దలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు . రోజు జరిగే ఉత్సవాలలో భక్తులందరూ పాల్గొని సీతాలమ్మ దేవత అనుగ్రహమును పొందాలని గ్రామ పెద్దలు తెలిపారు

## నారాయణ మూర్తికి సన్మానం

బుచ్చినాయుడు కండ్రిగ, జులై 3 ప్రభాతవార్త:

బుచ్చినాయుడు కండ్రిగ పోలీస్ స్టేషన్లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ఏ. నారాయణమూర్తి ఎస్సైగా ప్రమోషన్ పొందినందుకు స్థానిక ఎస్సై హరి ప్రసాద్, సిబ్బంది ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ నందు ఘనంగా సన్మానించడం జరిగింది సందర్భంగా ఎస్సై హరిప్రసాద్ మాట్లాడుతూ ఏఎస్సై నారాయణమూర్తి సేవలు మర్చిపోలేనివని, ఆయన ఎక్కడ పని చేసిన ఆరోగ్యంతో విధులు నిర్వహించేలా దేవుని కోరుకుంటున్నారని తెలిపారు.

## రోటరీ నూతన కమిటి



శ్రీకాళహస్తి, జులై 3 ప్రభాతవార్త:

శ్రీకాళహస్తి పట్టణంలోని స్థానిక రోటరీ క్లబ్‌నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం శుక్రవారం నిర్వహించారు. బెంగళూరు డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎలెక్ట్ హారిణి ముఖ్య అతిథిగా హాజరై నూతన కమిటీ సభ్యులకు రోటరీ పిన్‌లు అలంకరించారు. నూతన అధ్యక్షురాలిగా పి. ప్రమీల, కార్యదర్శిగా డా. ఆర్. మ్యాగిక్లారా బాధ్యతలు స్వీకరించారు. వీరితో పాటు డైరెక్టర్లు కూడా ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా 11 మంది నూతన సభ్యులు రోటరీలో చేరారు.కార్యదర్శి డా. మ్యాగిక్లారా మాట్లాడుతూ, రోటరీ ద్వారా పాఠశాలల అభివృద్ధి, మహిళా సాధికారత కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా డేవిడ్ రీస్ కుష్ఠ వ్యాధి ఆసుపత్రికి దాతల సహకారంతో విటమిన్ మాత్రలు, సబ్బులు, పుస్తకాలు ఉచితంగా అందజేశారు. రోటరీ సభ్యులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.

## పార్టీ పూర్తిస్థాయిలో బలోపేతం

–జెబిని సన్మానించిన ఆనంద్‌గౌడ్



తిరుపతి,జులై 3ప్రభాతవార్త:

సరైన నాయకుడు తిరుపతి టిడిపి ఇన్‌ఛార్జిగా శ్రీనివాస్ నియామకంతో తిరుపతిలో తెలుగుదేశం పార్టీ పూర్తిస్థాయిలో బలోపేతం అవుతుందని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల ఆనంద గౌడ్, రాష్ట్ర అధికార ప్రతినిధి కే.రామ్మోహన్ టిఎన్ఎస్ఎఫ్ యూనివర్సిటీ అధ్యక్షుడు బి. వెంకటేష్ నాయుడు హర్షం వ్యక్తం చేశారు. నాయకులకు కార్యకర్తలకు జెబి శ్రీనివాస్ నియామకం అండగా ఉంటుందని అన్నారు. తిరుపతి తెలుగుదేశం పార్టీ నూతన ఇన్‌చార్జ్‌గా నియామకమైన ఆయనను శుక్రవారం కలసి తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల ఆనంద గౌడ్, రాష్ట్ర అధికార ప్రతినిధి కె.రామ్మోహన్ టిఎన్ఎస్ఎఫ్ యూనివర్సిటీ అధ్యక్షుడు బి.వెంకటేష్ నాయుడు కలిసి గజమాలతో సన్మానించారు.

## ప్రజల హృదయాలలో చెరగని ముద్ర

–ఎస్వీ రంగారావుకు ఘన నివాళి



తిరుపతి,జులై 3ప్రభాతవార్త:

ఎస్వీ రంగారావు సుమారు 300 చిత్రాలలో నటించి నటన లోచిరస్మరణీయమని,తరాలు మారిన ఆయన నటించిన చిత్రాలు నేటికీ ప్రజల హృదయాలలో చెరగని ముద్ర వేశాయని బిజెపి నేత నవీన్ కుమార్ రెడ్డి తెలిపారు. ఎస్వీ రంగారావు 108 వ జయంతి సందర్భంగా శుక్రవారం రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. జోహార్ ఎస్వీ రంగారావు అంటూ నినాదాలు చేశారు. అనేక చిత్రాలలో తనదైన వాక్చాతుర్యంతో అద్భుతంగా నటించి తనకు తానే సాటి అని నిరూపించుకున్నారన్నారు. ఈ సందర్భంగా స్థానిక కళాకారులు రచయిత మాజీ ఉపాధ్యాయుడు ఆమూరి సుబ్రహ్మణ్యం ని శాలువతో సత్కరించి ఎస్వీ రంగారావు గారి జ్ఞాపకను బహుకరించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ రంగస్థలం ఛైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, కార్యదర్శి కె.ఎన్ రాజా, డాక్టర్ ఆమూరి సుబ్రహ్మణ్యం, రంగస్థలం సభ్యులు డాక్టర్ విద్వాన్ కస్పా పద్మనాభం, పోలే జనార్దన్ రెడ్డి, కుప్పిరెడ్డి రామకృష్ణారెడ్డి, పురోహితుడు సురేష్ స్వామి, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి పాల్గొన్నారు

## సంకల్ప సిద్ధి వినాయక ఆలయంలో...సంకట హర చతుర్థి





తిరుపతి,జులై 3ప్రభాతవార్త:

తిరుపతి వినాయక సాగర్‌లో సంకల్ప సిద్ధి వినాయక స్వామి ఆలయంలో శుక్రవారం సంకటహర చతుర్థి పర్వదినాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవోపేతంగా నిర్వహించారు. విఘ్నాలను తొలగించి, భక్తుల సంకల్పాలను సఫలం చేసే విఘ్నేశ్వరుని అనుగ్రహం కోసం పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. స్వామివారికి వేద మంత్రోచ్చారణల మధ్య పవిత్ర అభిషేకాలు నిర్వహించి, సుగంధ ద్రవ్యాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక అర్చనలు, అష్టోత్తర శతనామ పూజలు, మహా నైవేద్య సమర్పణలు జరిపి భక్తులకు దివ్య దర్శన భాగ్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పురోహితుడు సురేష్ స్వామి, ఆలయ ధర్మకర్త కొండేచంగా రెడ్డి, కమిటీ సభ్యులు గుండాల గోపీనాథ్‌రెడ్డి, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, వాసు,ప్రసాద్, శాంతిప్రియ, రత్నజ, కినీశా రెడ్డి, తన్విష్, మాధురి,తదితరులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు..

